
manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 250 | శుక్రవారం | 28.03.2025



# ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- ఆస్తి పన్ను వడ్డీ బకాయిలపై 90 శాతం రాయితీ
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, మన చౌరాస్తా : తెలంగాణ ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని పట్టణ, స్థానిక సంస్థలకు ఆస్తి పన్నుపై 90 శాతం బకాయి వడ్డీని మాఫీ చేసే వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని విస్తరించిన నేపథ్యంలో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో కోరారు. ఆస్తి పన్నుపై వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేసుకునే అవకాశం ఈ మార్చి 31 వరకు మాత్రమే ఉందన్నారు. వన్‌టైమ్ సెటిల్మెంట్ కింద ఆస్తి పన్ను చెల్లించే వారికి పన్ను వడ్డీ బకాయిలపై ప్రభుత్వం 90 శాతం రాయితీ వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఆస్తి పన్నును వడ్డీ బకాయిలతో చెల్లించిన వారికి వచ్చే ఆర్థిక సంవత్సరానికి సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి గ్రామ పంచాయతీ పరిధిలో 35,615 దరఖాస్తులు రాగా అందులో 3,713 మంది రుసుము చెల్లించారని వివరించారు. జనగామ, ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో 22,553 దరఖాస్తు లు రాగా 1,013 మంది రుసుము చెల్లించారని తెలిపారు. జనగామ పరిధిలో 3,241 దరఖాస్తు లు రాగా ఇప్పటి వరకు 341 మంది ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించారని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 640 మందికి ప్రొసీడింగ్ లను జారీ చేశామని, మిగతా వారికి కూడా త్వరగా ప్రొసీడింగ్ లు ఇస్తామని పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ రుసుము పైన 25 శాతం ఉన్న రాయితీ కూడా మరో 4 రోజుల్లో ముగియనుందని, ఈ అవకాశాన్ని కూడా దరఖాస్తు దారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



2 లో

## ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు



3 లో

## 'బాలయేసు' అనుమతి రద్దు చేయాలి

# ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి
- ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేయాలని సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జనగామ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.




3 లో

General News



# మైక్రో గ్రిడ్ సౌర ప్రాజెక్టు ప్రారంభం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండలంలోని ఓబుల్ కేశ్వాపూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో యూత్ ఆఫ్ ఇండియా ఎన్జీవోస్ సంస్థ ఆధ్వర్యంలో మైక్రో గ్రిడ్ సౌర ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొనగా, పాఠశాల విద్యార్థులు స్వాగత నృత్యంతో ఘనంగా కలెక్టర్ ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. యూత్ ఆఫ్ ఇండియా ఎన్జీవోస్ సంస్థ సహకారంతో సేల్స్ ఫోర్స్ సాఫ్ట్ వేర్ కంపెనీ చేయూతతో రూ.కోటి అరవై లక్షలతో గ్రామంలో 100 ఇళ్లకు సౌర ప్యానెల్ లు, అలాగే 100 సౌర వీధి దీపాలు, పాఠశాలలో కూడా పది సౌర ప్యానెల్ లను అమర్చారని తెలిపారు. గత ఏడు కూడా నర్మెట మండలంలోని ఎర్రగొల్లపహాడ్‌లో ఈ ప్రాజెక్టును ప్రారంభించారని, రెండో ప్రాజెక్టు కింద ఇక్కడ నెలకొల్పారని అన్నారు. ఇదే విధంగా మరిన్ని గ్రామాలను దత్తత తీసుకొని, సౌర ప్రాజెక్టును చేపడుతూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించాలని కోరారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద గృహాలకు కనెక్షన్ తీసుకోవచ్చని, బ్యాంకు రుణ సదుపాయం ఉందని, రాయితీ కూడా వీటికి లభిస్తుందని, అలాగే గ్రామాల్లో, పాఠశాలలో, పొలాల వద్ద కూడా ఈ సౌర ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవచ్చని, అందుకోసం ఈ పీఎం సూర్య ఘర్ వెబ్ సైట్ లో రిజిస్టర్ చేసుకోవాలని, ఈ పథకం పట్ల మరింత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ ప్రాజెక్టు ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడమే



కాకుండా పునరుత్పాదక శక్తి వనరుల వినియోగంతో పచ్చని భవిష్యత్తుకు దోహదపడుతుందని వెల్లడించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులు రూపొందించిన సౌర శక్తి ప్రాజెక్టు నమూనాను కలెక్టర్ వీక్షించి వారిని అభినందించారు. అంతకుముందు యూత్ ఆఫ్ ఇండియా ఎన్జీవోస్ సంస్థ సహకారంతో సేల్స్ ఫోర్స్ సాఫ్ట్ వేర్ కంపెనీ చేయూతతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ రమేష్, పాఠశాల హెడ్ మిస్ట్రెస్ వీరాంజని, యూత్ ఆఫ్ ఇండియా ఎన్జీవోస్ సంస్థ సభ్యులు శైలేష్, సాయి, రాజు, చంద్రశేఖర్, సేల్స్ ఫోర్స్ సాఫ్ట్ వేర్ కంపెనీ సభ్యులు సంకేత్, కిరణ్, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్

# ఏర్పాటు చేయాలని వినతి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్, మినీ టెక్స్ టైల్ పార్క్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, సాఫ్ట్ వేర్ కంపెనీలు నెలకొల్పాలని మాదిగ మేధావుల ఫోరం జనగామ కోఆర్డినేటర్ యాసారపు కరుణాకర్ కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని చెప్పి జనగామ జిల్లా ప్రజలు, నిరుద్యోగులు, విద్యార్థులను మోసం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా వెంటనే హన్మకొండ – హైదరాబాద్ మధ్యలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి ఇక్కడి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఎర్రబెల్లి దయాకర్ రావు పది సంవత్సరాలు ప్రభుత్వంలో ఉండి రేపు ఎన్నికల కోడ్ వస్తది అనగా హడావిడిగా శంకుస్థాపన చేసిన కొడకండ్ల మిని టెక్స్ టైల్



పార్క్ పనులు ఆగిపోయాయని అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చొరవ చూపి మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు నిధులు తేవాలని అన్నారు. కార్యక్రమంలో మాదిగ మేధావుల ఫోరం జనగామ అధ్యక్షుడు గొంగల్ల కుమార్, మేకల సమ్మయ్య, మహమ్మద్ అబ్దుల్, గఫార్, జేరిపోతుల రఘు తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా జనగామ బార్ అసోసియేషన్ ఎన్నికలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం పూర్తి కమిటీకి ఎన్నికను నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దండెబోయిన హరిప్రసాద్ యాదవ్ తో పాటు పలు పదవులకు ఏకగ్రీవం అయిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో గురువారం ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యుల ఎన్నిక పోలింగ్‌ను నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా పాలకుర్తి రామకృష్ణ, మన్నె సత్తయ్య పోటీ పడగా.. పాలకుర్తి రామకృష్ణ 28 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కార్యవర్గ సభ్యులుగా బి.చరణ్, నేతి శ్రీమన్ ఇ.జోస్న, రవికుమార్, కె.దాసు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీరామ్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు దొమ్మాటి సురేష్, గుండెల్ని రాజశేఖర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా దండబోయిన హరిప్రసాద్ యాదవ్, ఉపాధ్యక్షుడు ఇరిగి అశోక్, జాయింట్ సెక్రెటరీ చాట్ల నర్సింగరావు, కోశాధికారి ఏ, బాలరాజు, లైబ్రరీ సెక్రెటరీ సయ్యద్ అన్వర్ ఉల్లా అస్మి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ రెడ్డబోయిన రాజు, మహిళా కార్యదర్శి కె.సునీత రాణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

## నేతి శ్రీమాన్‌కు అభినందన



ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా లీగల్ సెల్ విభాగం నాయకుడు నేతి శ్రీమాన్ జిల్లా బార్ కౌన్సిల్ ఎలక్షన్‌లో ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా గెలుపొందారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ ఆయనను అభినందించారు.



# ఢిల్లీలో జనగామ వాసికి సన్మానం

**జనగామ, మన చౌరాస్తా :** ప్రముఖ ధూమ్ దాం కళాకారుడు, కవి, గాయకుడు బానోత్ గణేష్ కు ఢిల్లీలో ఘనంగా సన్మానించారు. ఇండియన్ కరెన్సీ నోట్ల మీద డా.బాబాసాహెబ్ అంబేద్కర్ ఫొటోను ముద్రించాలని డిమాండ్ చేస్తూ జేరిపోతుల పరశురాం ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద తెలంగాణ నుంచి వచ్చిన సుమారు 100 మంది కళాకారులతో ధూంధాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా పలువురు తెలుగు రాష్ట్ర ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాని స్థాపించిన మేధావి అంబేద్కర్ అని తెలిపారు. ఆనాడు పరాయి పాలనలో ఉన్న మన దేశంలో అస్తవ్యస్తంగా ఉన్న ఆర్థిక పరిస్థితులని సరిదిద్ది, దేశంలో నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని కరెన్సీ నోట్ల మీద తప్పకుండా ముద్రించాలని అన్నారు. అనంతరం ధూమ్ దాంలో పాల్గొన్న కళాకారులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీలు ఈటెల రాజేందర్, ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్ రావు, వకుళాభరణం కృష్ణమోహన్ రావు, అప్పలనాయుడు, ప్రసిద్ధ ధూంధాం కళాకారులు ఏపూరి సోమన్న, వొల్లాల వాణి, చెరుకు మల్లిక, ముక్కెర సంపత్, రామంచ భరత్, రేలారే గంగ తదితరులు పాల్గొన్నారు.

Local News




# ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

■ **సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేయాలని సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జనగామ పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, జనగామ పట్టణంలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం స్థానిక జనగామ ఆర్డీవో గోపి కృష్ణ అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షత వహించగా కనకారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారుగా 16 నెలలు గడిచినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వకపోవడం, ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వకపోవడం వల్ల చాలా అద్దె ఇండ్లలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. రేషన్ షాప్ ద్వారా 16 రకాల వస్తువులు ఇవ్వాలని, పంట ఎండిపోయిన పంటకు ఎకరానికి రూ.50 వేలు ఇవ్వాలని, దేవాదుల కాలువ ద్వారా చెరువులు కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, ఎండి అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, బాల్న వెంకట మల్లయ్య, బొట్ల శ్రావణ్, మంగ వీరయ్య, బూడిది ప్రశాంత్, పాముకుంట్ల చందు, పాము శ్రీకాంత్, నాయకులు సుమ, సౌందర్య, ధరావత్, మహేందర్, మున్సిపట్ల జయ, మల్లేష్, రాజ్, సుధాకర్, ఉపేందర్, ఎర్ర అనిత, కమల, ఆనంద్, సంపత్, హరీష్, వసంత, అనిత, పద్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను నెరవేర్చాలి




బచ్చన్నపేట, మన చౌరాస్తా : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం బచ్చన్నపేట మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేయాలని, గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రావుల రవీందర్ రెడ్డి, మిన్నలపురం ఎల్లయ్య, బైరగోని బలరాములు, ఇంజ ఎల్లయ్య, గోలకొండ ఈదమ్మ, నాయకులు మల్లయ్య, కుడుదల సిద్ధయ్య, జేరిపోతుల జగన్, పగటిపల్లి పరుశరాములు, బత్తులచంద్రయ్య, కట్ట రవి, రామగళ్ళ మల్లేష్, నీల మణెమ్మ, మల్లం అంజమ్మ, కడప లక్ష్మి, బూరెల దుర్గమ్మ, మోత్కూరు ఎల్లమ్మ, గడ్డల ఎల్లవ్వ, గంగగరమైన బుచ్చమ్మ, బండ పోచమ్మ, పాకాల కవిత, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812



# కళాకారులు రాజకీయంగా రాణించాలి

## ప్రముఖ సంగీత దర్శకుడు విష్ణుకిషోర్

**జనగామ, మన చౌరాస్తా :** కళాకారులు రాజకీయాలల్లోను రాణించి చట్టసభలో ప్రజాప్రతినిధులుగా అడుగుపెట్టినప్పుడే సాంస్కృతిక రంగానికి న్యాయం జరుగుతుందని తెలంగాణ ఉద్యమ కళాకారులు, ప్రముఖ సంగీత దర్శకులు విష్ణు కిషోర్ అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్ లో గురువారం తెలంగాణ కళాకారుల వేదిక విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జనగామ జిల్లా కవులు కళాకారులకు వేదిక కన్వీనర్ జి. కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సిద్ధాంతాలు తయారు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కళా వేదిక రాష్ట్ర వ్యవస్థాపకులు కామల్ల అయిలన్న మాట్లాడుతూ కళాకారుల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. జానపద కళలను పరిరక్షించి కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ బైరాగి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలలో కళాకారుల వాటా ఎంత అని ప్రశ్నించారు. కల్చరల్ పాలసీ ఉండాలని, స్పోర్ట్స్ కోటా ఉన్నట్టుగానే సాంస్కృతిక రంగానికి కోటా ఉండాలని డిమాండ్ చేశారు. దళిత బంధు మాదిరిగా కళాబంధు స్కీమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటాచారి మాట్లాడుతూ కళాకారులకు తగిన గుర్తింపు రావడం లేదని, కళాకారులు ఐక్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిలుమోజు సాయికిరణ్, గొలుసులు ఎల్లయ్య, గడ్డం యాదయ్య, కడారి శ్రీను, నల్ల ఆంజనేయులు, నర్సింగ యాదయ్య, దామెర లావణ్య, రమేష్ నాయక్, లగిశెట్టి ప్రభాకర్, అంబాల శ్రీనివాస్ గౌడ్, కొదిరిపాక మ్యాజిక్ ఆనంద్, మసురం రాజేంద్రప్రసాద్, కిరణ్ కుమార్, డి. శ్రీదేవి, సన్నీ పాల్గొన్నారు.



# బాలయేసు స్కూల్ అనుమతి రద్దు చేయాలి

**– ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం**

**జనగామ, మన చౌరాస్తా :** విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా నడుస్తున్న దేవరుప్పుల మండలంలోని బాలాయేసు ఇంగ్లిష్ మీడియం స్కూల్ అనుమతిని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ భిక్షం డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ బాలయేసు స్కూల్ పై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యా శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.. వారు స్పందించి బాలయేసు స్కూల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేశారని వివరించారు. బాలయేసు అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా నడుపుతున్న స్కూల్ పై విద్యా శాఖ అధికారులు సరైన విచారణ జరపడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా బాలయేసు స్కూల్ అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దశాగాని సుమ, యకన్న, ఆర్య పాల్గొన్నారు.




## నితిన్.. హిట్ కొట్టాడా..?

టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటేస్ట్ మూవీ రాబిన్ హుడ్. డైరెక్టర్ వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మోస్ట్ వాంటెడ్ బ్యూటీ శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్, ట్రైలర్ ఆకట్టుకున్నాయి. యంగ్ హీరో నితిన్ హిట్ కోసం చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాడు. వరుసగా సినిమాలు చేస్తున్నా కూడా సరైన హిట్ అందుకోలేకపోతున్నాడు. భీష్మ సినిమా తర్వాత నితిన్ ఆ రేంజ్ హిట్ అందుకోలేకపోయాడు. కాగా ఇప్పుడు నితిన్ రాబిన్ హుడ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేశాడు. నేడు ఈ సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది. వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే వెన్నెల కిషోర్, రాజేంద్ర ప్రసాద్ తో పాటు డేవిడ్ వార్నర్ కూడా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా ప్రీమియర్స్ ఇప్పటికే పడటంతో సినిమా రివ్యూను ట్విట్టర్ లో పోస్ట్ చేస్తున్నారు. సినిమా ఎలా ఉందో తమ అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలుపుతున్నారు. గతంలో నితిన్, వెంకీ కుడుముల కాంబినేషన్ లో భీష్మ సినిమా తెరకెక్కిన విషయం తెలిసిందే.. ఇప్పుడు మరోసారి ఈ ఇద్దరూ కలిసి థియేటర్స్ లో మరోసారి నవ్వులు పూయించారని అంటున్నారు అభిమానులు. నితిన్ బ్లాక్ బస్టర్ కొట్టాడని , నితిన్, రాజేంద్రప్రసాద్, వెన్నెలకిషోర్ కాంబోలో వచ్చే కామెడీ సినిమా మాత్రం బాగా నవ్విస్తాయని చెబుతోన్నారు. కామెడీ అదిరిపోయిందని కామెంట్స్ చేస్తున్నారు.